క్లుప్తంగా

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఎస్ఎస్‌పీ కాలనీలోని షిరిడి సాయినాథుని మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, సతీమణి లీలావతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట: విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా సోమవారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా ఉండదని చెప్పారు. పట్టణంలోని మద్దినగర్, రహమత్‌నగర్, దాసరి కాలనీ, వెంగళరెడ్డినగర్, శ్రీనివాసకాలనీ, ముదిరాజ్ కళ్యాణ మండప ప్రాంతం, వడ్డెర కాలనీ, గవర్నమెంటు ఆస్పత్రి రోడ్డు పరిసర ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

క్రీడాదుస్తులు పంపిణీ



ఈపూరు: మండలంలోని కొండ్రముట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎన్‌టీఆర్ జిల్లా విజయవాడ మండలం నున్న గ్రామానికి చెందిన బేతపూడి ముత్తయ్య తన కుమారుడు చంద్రశేఖర్ జ్ఞాపకార్థం రూ.15 వేలు విలువ చేసే క్రీడా దుస్తులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఎన్.సిహెచ్.బి.జె.లక్ష్మి మాట్లాడుతూ దాతల సహకారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు యేసురాజు, ముత్తయ్య కుటుంబ సభ్యులు, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుక్మాబాయి అమ్మవారికి సారె

నరసరావుపేట ఈస్ట్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని భక్తులు ఆదివారం శ్రీపాండురంగస్వామి ఆలయంలో శ్రీరుక్మాబాయి అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయ ధర్మకర్త తాటికొండ కోటేశ్వరరావు, కుమారివాణి దంపతుల ఆధ్వర్యంలో స్వామి వారికి ఆషాఢం పట్టి, అమ్మవారికి సారె సమర్పించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీవాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, కొత్తమాసు సుజాతలక్ష్మి, రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మల్లమ్మదేవి నేత్రాలు దానం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరుకు చెందిన కంచుమాటి మల్లమ్మదేవి(86) వృద్ధాప్య కారణంగా ఆదివారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు మృతురాలి నేత్రాలు దానం చేయటానికి అంగీకరించడంతో పెదకాకాని శంకర కంటి వైద్యశాలకు దానం చేసినట్లు అమ్మ నేత్ర అవయవ శరీర దాన ప్రోత్సాహకుల సంఘం జిల్లా కోఆర్డినేటరు సంద్రపాటి చలపతిరావు తెలిపారు. కార్యక్రమంలో శంకర వైద్య నిపుణులు డాక్టరు హర్షత, సిబ్బంది, కుటుంబ సభ్యులు శేషగిరిరావు, అజయ్‌కుమార్, మహాలక్ష్మమ్మ, అరుణాకుమారి పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడే జగద్గురు

బొల్లాపల్లి: త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి ఇందూజ్ఞాన వేదిక, పిడుగురాళ్ల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని గుమ్మనంపాడు గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం ఆదివారం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు కటికం సైదారావు త్రైత సిద్ధాంత ప్రబోధ ప్రచారంలో భాగంగా భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇందూజ్ఞాన వేదిక పిడుగురాళ్ల కమిటీ సభ్యులు కె.అరుణ, కె.కోటేశ్వరరావు, కె.నారాయణమ్మ, కె.గోపి, డి.శ్రీను, ఎం.వీరయ్య, టి.భూలక్ష్మి పాల్గొన్నారు.

రేపు అంబేడ్కర్ జీవిత నృత్యరూప నాటకం

నరసరావుపేట ఈస్ట్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను వివరించే సంఘం.. శరణం.. గచ్ఛామి నృత్యరూప నాటకాన్ని ఈనెల 30వ తేదీ భువనచంద్ర టౌన్‌హాల్‌లో ప్రదర్శించనున్నట్లు ప్రజా నాట్యమండలి పల్నాడు జిల్లా కమిటీ అధ్యక్షుడు టి.పెద్దిరాజు ఆదివారం తెలిపారు. హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ కళాకారులు ఈ నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. డాక్టర్ అంబేడ్కర్ కొందరివాడు కాదు.. అందరివాడంటూ వాడవాడలా చాటిచెప్పేలా నృత్యరూప నాటకాన్ని కె.దేవేంద్ర రచించగా, తూము శివప్రసాద్ దర్శకత్వం వహించారని వివరించారు.

వినుకొండ బస్టాండ్‌లో నిబంధనల కొర్రీ

- రాత్రి 11 గంటలకే మూతపడుతున్న దుకాణాలు
- నకరయాతన పడుతున్న ప్రయాణికులు
- అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు



ఆర్టీసీ ఆవరణలో మూతపడిన దుకాణాలు

వినుకొండ(నూజెండ్ల): ఆర్టీసీ అధికారుల నిబంధనలతో ప్రయాణికులు, వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. సాధారణంగా బస్టాండ్ 24 గంటలూ ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. తాజాగా ఓ ఘటనను ఆసరాగా చేసుకుని బస్టాండ్‌లో పదకొండు గంటలకే వ్యాపార దుకాణాలు అన్ని మూతవేయాలని నిబంధన విధించారు. దీంతో అవస్థలు తప్పడం లేదు.

రాత్రి ప్రయాణాలు..

వినుకొండ డిపో మీదుగా తెలంగాణ, హైదరాబాద్, విశాఖపట్టణం, కర్నాటక, శ్రీశైలం, రాయలసీమ జిల్లాలకు వందలాది బస్సు సర్వీసులు రాత్రి వేళల్లో నడుస్తున్నాయి. ఇక్కడ కొద్దిసేపు బస్సులు ఆగుతాయి. ఆ సమయంలో కొంత మంది ప్రయాణికులు కాలకృత్యాలు తీర్చుకోవడంతో పాటు అల్పాహారం తీసుకునేందుకు అవకాశం ఉంది.

నిబంధనలతో..

వినుకొండ ఆర్టీసీ డిపోలో 24 గంటలు దుకాణాలు పనిచేస్తుంటాయి. బస్సుల రాకపోకల బట్టి వ్యాపారం ఉంటుంది. ఆ మేరకు దుకాణదారులు వేలం సమయంలో తగిన మొత్తాన్ని చెల్లించి అద్దె ఖరారు చేసుకుంటారు. టెండరు నిబంధనలు 24 గంటలు ఉన్నా వినుకొండలో మాత్రం 11.00 గంటలకే షాపులు మూతపడాల్సిందే. డిపో అధికారుల తీరు వ్యాపారులకు శాపంలా మారింది. ప్రమాణికులు, వ్యాపారుల ఇబ్బందుల దృష్ట్యా దుకాణాల సమయంలో వెసులుబాటు కల్పించాలని కోరుతున్నారు.

ఫ్లెక్సీలను నియంత్రించాలి



డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు రాసిన లేఖను ప్రదర్శిస్తున్న లోక్‌సత్తా నాయకుడు

చిలకలూరిపేట: రోడ్డు ప్రమాదాలకు కారణమవ్వడంతో పాటు, పర్యావరణానికి పెనుముప్పుగా మారుతున్న ఫ్లెక్సీలను నియంత్రించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ మాదాసు భానుప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్‌కు లేఖ రాశారు. ఆయన మాట్లాడుతూ కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలలో ఫ్లెక్సీలను కఠినంగా నియంత్రించగా, మన రాష్ట్రంలో విచ్చలవిడిగా ఎక్కడ పడితే అక్కడ ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. పార్టీల నాయకుల మెప్పు కోసం రాష్ట్రంలో వేలకు వేలు ఖర్చు పెట్టి ఈ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. నిబంధనలు అతిక్రమించి ఏర్పాటు చేస్తున్న ఈ ఫ్లెక్సీల కారణంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులకు ఈ విషయం తెలిసి కూడా కార్యకర్తలను నియంత్రించటం లేదని విమర్శించారు. పర్యావరణానికి హాని చేయడంతో పాటు వాహన చోదకులకు, ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యానికి గురి చేస్తున్న ఫ్లెక్సీల గురించి సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు హరిప్రసాద్, కృష్ణప్రసాద్, వెంకట్రావు పాల్గొన్నారు.

గణపవరంలో అధ్వానంగా పారిశుద్ధ్యం

- రోడ్డుపై పారుతున్న మురుగు, ఎక్కడికక్కడ చెత్తకుప్పలు
- సీజనల్ వ్యాధుల భయంతో స్థానికులు



గణపవరం సినిమాహాల్ రోడ్డులో సిమెంట్ రోడ్డు పైనే ప్రవహిస్తున్న మురుగునీరు

నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జ్వరాలతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో డెంగీ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలు మరింత పెరిగాయి. కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి వర్షం నీరు పారుదల రోడ్డుపై చేరి వీధులను ముంచెత్తుతోంది. వర్షంనీటితో పాటూ మురుగునీరు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి చేరుతోంది. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య నిర్వహణలో తీవ్ర అలసత్వం చూపుతున్నారని మండిపడుతున్నారు. పంచాయతీ అధికారులు పటిష్ట చర్యలు తీసుకుని మురుగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.



మురుగుతో నిండిన సైడు కాలువ

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపడతాం...

కాలువల్లో చెత్త, పూడిక తీసేందుకు సౌకర్యం లేకుండా గృహ యజమానులు, దుకాణదారులు కాలువలను పూర్తిగా బండరాళ్లతో మూసివేయటం సమస్యకు ప్రధాన కారణం. త్వరలో కాలువలు మూసివేసిన గృహ యజమానులు, దుకాణదారులకు నోటీసులు జారీ చేస్తాం. పొక్లెయిన్ సాయంతో మురుగు కాలువలు శుభ్రం చేసి సమస్య పరిష్కరిస్తాం

–మారుతిబాబు, పంచాయతీ కార్యదర్శి, గణపవరం

పుట్టకోట సర్పంచి మృతి



యడ్లపాడు: మండలంలోని కొత్తపాలెం గ్రామ పంచాయతీ సర్పంచి మొలమంటి వెంకట సుబ్బారావు(58) అనారోగ్యం ఆదివారం మృతి చెందారు. శుక్రవారం సాయంత్రం తన నివాసంలో అనారోగ్యంగా ఉందంటూ ఒక్కసారిగా కుప్పకూలడంతో కుటుంబ సభ్యులు గుంటూరు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య వెంకటనర్సమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం కొత్తపాలెం గ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఈల పాట కళాకారుడికి సన్మానం



చిలకలూరిపేటటౌన్: ప్రముఖ ఈలపాట కళాకారులు ఏఆర్ లయను ఆదివారం ఘనంగా సత్కరించారు. మండలంలోని పసుమర్రు గ్రామానికి చెందిన లయ పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవార్డులు గెలుపొందారు. ఈ నేపథ్యంలో సమాజ సేవకులు డాక్టర్ చుక్కా విన్సెంట్‌పాల్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బొంత భాగ్యరాజు, ధూళిపాళ్ల శ్రీనివాసరావు, వెంకట్, దార్ల బుజ్జిబాబు ఉన్నారు.

పూడికతీత పనులు పరిశీలన



డ్రెయిన్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: పట్టణంలోని బరంపేట బైపాస్‌రోడ్డుపైన కల్వర్టు పూడిక తీత, బైపాస్ పక్కన అక్రమ కట్టడాల తొలగింపు పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. పనులను అధికారులు, నాయకులతో కలసి ఆదివారం పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులన్నీ పూర్తిచేసి ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించే బాధ్యత తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ నాయకులు సంజీవ్‌రావు, మోహన్‌రావు, సాంబయ్య, క్రాంతి పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పనులు..

పేదల ఆకలి తీర్చినపుడే రాజకీయ నాయకునిగా అసలైన సంతృప్తి కలుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని చేపట్టిన అన్న క్యాంటీన్ భవనాల మరమ్మతులు పరిశీలించారు. కూటమి ప్రభుత్వం పేదలకు ఎప్పుడూ అండగా నిలుస్తుందని, అన్న క్యాంటీన్ల ప్రారంభంతో మరోసారి నిరూపించబోతున్నామని అన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన



అవగాహన కలిగిస్తున్న ఎస్ఐ రవీంద్రబాబు

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కొత్త చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ కె.పి.రవీంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త చట్టాలు కఠినతరంగా ఉన్నాయని అన్నారు. గ్రామస్తులు అందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. గ్రామాలలో ఏమైనా అవాంఛనీయ ఘటనలు జరిగినా, ఎవరైనా గొడవలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మహిళలు, బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తించినా, లైంగికదాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన చట్టాలు గ్రామాలలో అమలు చేసేందుకు పోలీస్ శాఖకు గ్రామస్తులు సహకరించాలని కోరారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

- ఇద్దరు డ్రైవర్లకు గాయాలు
- ప్రయాణికులు సురక్షితం



పొలాల్లోకి దూసుకెళ్లిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు



బోల్తా పడిన ట్రాక్టర్

నకరికల్లు: మట్టిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. ఇద్దరు డ్రైవర్లకు గాయాలయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు... రొంపిచర్ల మండలంలోని విప్పర్ల గ్రామం వైపు నుంచి ట్రాక్టర్ మట్టిలోడుతో పిడుగురాళ్ల వైపు వెళుతోంది. సుమారు 40 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఈ ట్రాక్టర్‌ను వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ బోల్తాపడింది. బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ప్రయాణికులు నిద్రమత్తులో ఉన్న సమయంలో ప్రమాదం సంభవించడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. భయంతో హాహాకారాలు చేశారు. సమీపంలోని హోటళ్ల వారి సహకారంతో అందరూ క్షేమంగా కిందకు దిగారు. ఈ ఘటనలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అలహాబాద్‌కు చెందిన బస్సు డ్రైవర్ నిజాంఖాన్‌కు గాయాలయ్యాయి. ట్రాక్టర్ డ్రైవర్ మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి బత్తుల చినసుబ్బయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 సహాయంతో నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రమాదంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. పోలీసులు ట్రాక్టర్‌ను, మట్టిని పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.నాగేందర్‌రావు తెలిపారు.

అనధికార లేఅవుట్ల పరిశీలన



నాదెండ్ల: అనధికార లేఅవుట్లను గుర్తించేందుకు అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. మండలంలోని సాతులూరులో విచ్చలవిడిగా ఎలాంటి అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్‌లను ఆదివారం ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి రాఘవయ్యతో కలసి పరిశీలించారు. లేఅవుట్‌లకు పంచాయతీ, సంబంధిత శాఖల అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రజలు అనధికార లేఅవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేయవద్దని సూచించారు.

సూర్యనారాయణకే మా మద్దతు



సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పల్నాడు కమిటీ

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నుంచి కె.ఆర్.సూర్యనారాయణను సస్పెండ్ చేస్తున్నట్లు ఆస్కారావు ప్రకటించటాన్ని సంఘం పల్నాడు జిల్లా శాఖ నాయకులు ఖండించారు. జిల్లా కార్యాలయంలో ఆదివారం జిల్లా యూనిట్ అధ్యక్షుడు స్వర్ణ చినరామిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఆస్కారావు చర్యలను ఖండిస్తూ సూర్యనారాయణకు మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా చినరామిరెడ్డి మాట్లాడుతూ, సూర్యనారాయణను తొలగించే అధికారం ఎవరికీ లేదని స్పష్టం చేశారు. గతంలో సంఘం నుంచి తొలగించబడిన ఆస్కారావు, శ్రీకాంత్‌లకు ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడే అర్హత లేదని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి చుక్కా వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ షేక్.బాజీ మస్తాన్, తాలూకా యూనిట్ అధ్యక్షురాలు ఎం.ఫ్లోరెన్స్, జె.వెంకటేశ్వర్లు, రేణుక పాల్గొన్నారు.

కాలేయం దెబ్బతింటే ప్రాణాలకే ప్రమాదం

సత్తెనపల్లి: కాలేయం దెబ్బతింటే నయం కావడానికి సమయం పడుతుందని, ఒక్కోసారి ప్రాణాల మీదకు కూడా వస్తుందని నరసరావుపేట శకుంతల వైద్యశాల అధినేత డాక్టర్ ఐలా శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘం హాల్‌లో వైద్యులకు కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్ సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాలేయ వ్యాధికి చాలా మంది నాటు వైద్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తుచేశారు. వ్యాధి ముదిరాక వైద్యుల వద్దకు వస్తున్నారని పేర్కొన్నారు. సమాజంలో 3 నుంచి 4 శాతం మందిని కాలేయ సమస్యలు వేధిస్తున్నట్లు అంచనా ఉందన్నారు. కలుషిత నీరు, ఆహారానికి దూరంగా ఉంటే హెపటైటిస్ ఏ,ఈ వైరస్‌లు దరి చేరవన్నారు. పరీక్షలు, చికిత్స గురించి వివరించారు. శ్రీవిద్య వైద్యశాల మేనేజింగ్ డైరెక్టర్ తడవర్తి శ్రీవిద్య మాట్లాడుతూ.. మలబద్ధకం, చికిత్స గురించి వివరించారు. సమావేశంలో సత్తెనపల్లి అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి డాక్టర్ జి. శ్రీధర్‌లను ప్రత్యేకంగా అభినందించారు.

వైద్యాధికారి డీడీఓ అధికారాలు నిలిపివేత

యడ్లపాడు: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.ప్రభాకరరావుకు ఉన్న డీడీఓ అధికారాల నుంచి తప్పిస్తూ జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి ఉత్తర్వులు జారీ చేశారు. విధులలో అలసత్వం, తమను వేధింపులకు గురి చేస్తున్నారంటూ అస్పత్రి ఉద్యోగులు పలుమార్లు ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశారు. దీంతో తీరుమార్చుకోవాలంటూ జిల్లా అధికారులు హెచ్చరించారు. ఎంతకూ తీరు మార్చుకోకపోవడంతో ప్రభాకరరావు డీడీఓ అధికారం నుంచి తప్పించి పీహెచ్‌సీలోని మరో వైద్యులైన భరద్వాజకు బాధ్యతలు అప్పగించాలంటూ డీఎంహెచ్‌ఓ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.



శావల్యాపురం నిండుగా ఉన్న చెరువు

తాగునీటి చెరువులకు జలకళ

శావల్యాపురం: మండలంలోని గ్రామాల్లో తాగునీటి చెరువులు, , కుంటలు సాగర్ జలాలతో నూరుశాతం నింపాలని ఎంపీడీఓ కొర్రపాటి కవితాచౌదరి ఆదివారం తెలిపారు. తాగునీటి సమస్యను అధిగమించటానికి ప్రభుత్వం సాగర్ జలాలను విడుదల చేసిందన్నారు. మండలంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో ఉన్న గ్రామాల్లో మతుకుమల్లి, శానంపూడి, వయ్యకల్లు, శావల్యాపురం, వేల్పూరు తదితర గ్రామాల్లోని రక్షిత తాగునీటి పథకాలకు సంబంధిచిన మంచినీటి చెరువులన్నీ నూరుశాతం నింపాలన్నారు. ఇప్పటికే శావల్యాపురంలో తాగునీటిచెరువు 70 శాతం సాగర్ జలాలతో నింపినట్లు ఎంపీడీఓ తెలిపారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్నెస్పీ అధికారుల సౌజన్యంతో నింపాలన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

నకరికల్లు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి ప్రధాన లైనుకు సర్వీస్ వైరు కనెక్షన్ ఇస్తుండగా ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ ఘటన మండలంలోని గుండ్లపలిలో శనివారం రాత్రి జరిగింది. బీసీ కాలనీకి చెందిన రామారావు విద్యుత్ బిల్లులు చెల్లించలేదని ఆ శాఖ వారు కనెక్షన్ తొలగించారు. ఈ క్రమంలో రామారావు సూచన మేరకు నాగరాజు ప్రధాన లైనుకు సర్వీస్ వైరు జోడించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కాడు. ఆ సమయంలో షాక్‌కు గురయ్యాడు. క్షతగాత్రుడిని నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. విద్యుత్ శాఖ ఏఈ సురేష్‌ను వివరణ కోరగా.. క్షతగాత్రుడికి డిపార్ట్‌మెంట్‌తో సంబంధం లేదన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడే క్రమంలో ప్రమాదం జరిగి ఉంటుందని పేర్కొన్నారు. దీనికి సంబంధించి పోలీసులుకు ఫిర్యాదు చేశామన్నారు.

కాసు బ్రహ్మానందరెడ్డికి నివాళి



డీసీసీ కార్యాలయంలో కేబీఆర్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నరసరావుపేట: కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, కేక్ కట్‌చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ మాట్లాడుతూ కేబీఆర్ ఉమ్మడి రాష్ట్రానికి ఏడేళ్లకుపైగా ముఖ్యమంత్రిగా వ్యవహరించి రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపారన్నారు. తన రాజకీయ జీవితంలో చేపట్టిన ప్రతి పదవికి వన్నె తెచ్చిన గొప్ప నాయకుడు అని కొనియాడారు. . ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. పీసీసీ మెంబర్ గోదా సీదాకృష్ణ, బీసీసెల్ నాయకుడు పూర్ణ, సత్యం పాల్గొన్నారు.

బైక్‌ల్లోని పెట్రోల్ చోరీ..!

యడ్లపాడు: ఇళ్లముందు నిలిపి ఉన్న బైక్‌లలో పెట్రోల్ చోరీ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని మైదవోలు రోడ్డులో ఇంటి ముందున్న వాహనాల వద్ద గురువారం అర్ధరాత్రి ముగ్గురు అనుమానాస్పదంగా ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. వీరు నిలిపి ఉన్న బైక్‌ల నుంచి పెట్రోల్‌ను బాటిళ్లకు తీయడం గమనించాడాన్ని చూసిన దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. అప్రమత్తమైన గ్రామస్తులు వారిని వెంటపడి ఒకరిని పట్టుకోగా మిగిలిన ఇద్దరు స్కూటీపై పరార్ అయ్యారు. పట్టుబడిన నిందితుడితో పాటు అతడి వద్ద ఉన్న పెట్రోల్ బాటిల్, జేబులోని గంజాయ్‌పొట్లాన్ని స్థానికులు పోలీసులకు అప్పగించినట్లు స్థానికులు తెలిపారు. చోరీకి వచ్చిన ముగ్గురు మైనర్లుగా పోలీసులు గుర్తించారు.